www.kalamjyothi.com

# కలంజ్యోతి

రేపటి కోసం

మంగళవారం 28.01.2025






# 4 పథకాలు

- 561 గ్రామాల్లో ఏకకాలంలో ప్రారంభించిన ప్రభుత్వం
- పథకాల వారీగా లబ్ధిదారులకు పత్రాలు అందజేత

# 4,42,327 లబ్ధిదారులు

2లో



## ఆర్టీసీలో

# సమ్మె సైరన్

- ఆర్టీసీ అధికారులకు కార్మిక సంఘాల నోటీసులు
- పెండింగ్ సమస్యలు, డీఏ బకాయి, ప్రభుత్వంలో విలీనం ప్రధాన డిమాండ్లు

కలంజ్యోతి, హైదరాబాద్ :

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు సిద్ధమయ్యారు. తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ.. నాలుగేళ్ల తర్వాత మళ్లీ సమ్మె బాటపట్టనున్నారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్ లోని బస్ భవన్ లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు సమ్మె నోటీసును కార్మిక సంఘాల (జేఏసీ)నాయకులు అందజేశారు. ప్రధానంగా కార్మికుల హక్కులను కాల రాస్తుందని ఆర్టీసీ యాజమాన్యంపై జేఏసీ నేతలు ఆరోపించారు. సర్వీసుల్లో ఉన్న వారి సమస్యలు అటుంచితే కనీసం పదవి విరమణ పొందిన వారి సమస్యలు సైతం ఐదారేళ్ల నుంచి పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లు పెద్ద ఎత్తున బకాయిలు ఉన్నాయని తెలిపారు.పే స్కేళ్ల పెంపు విషయంలో ఇప్పటి వరకు ముందడుగు పడలేదన్నారు. 13 నెలల క్రితం రాష్ట్రంలో అధికారంలో వచ్చిన ప్రజా ప్రభుత్వం యూనియన్ల ఏర్పాటు, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అంశాలను విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జీతాలను సవరిస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయడం లేదని విమర్శించారు. హక్కుల సాధన, ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక, ఇతర హామీల అమలుకు సమ్మె నోటీసు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

## నొప్పి లేకుండా కణితి తొలగింపు

- వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో అరుదైన చికిత్స
- సర్జన్ పెంచలయ్య నేతృత్వంలో సర్జరీ సక్సెస్

2లో

## ఆత్మీయ భరోసాపై హైకోర్టులో పిల్

- గ్రామీణ కూలీలకే రైతు భరోసా
- పట్టణాల్లో ఉంటున్న రైతుకూలీలకు ఇవ్వడం లేదు
- నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ పిటిషన్

2లో



# నొప్పి లేకుండా కణితి తొలగింపు



- వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో అరుదైన చికిత్స
- సర్జన్ పెంచలయ్య నేతృత్వంలో సర్జరీ సక్సెస్

**కలంజ్యోతి, రాజన్న సిరిసిల్ల :**



వేములవాడ ప్రాంతీయ ఆస్పత్రిలో రాజన్న సిరిసిల్ల జిల్లా రాళ్లపేట గ్రామానికి చెందిన 53 సంవత్సరాల మహిళకి ఫిల్లోడ్స్ టూమర్ అనే రొమ్ములో గడ్డని ప్రత్యేక అరుదుగా ఇచ్చే మత్తు ద్వారా వైద్య బృందం తొలగించింది. మామూలుగా నరం ద్వారా శరీరం మొత్తం మత్తు వచ్చేలా చేసి గడ్డని తొలగిస్తారు. అలా కాకుండా వేములవాడలో ఉన్న మత్తు వైద్య బృందం డాక్టర్లు పెరికె తిరుపతి, రవీందర్, రాజశ్రీ, ప్రియాంక, సిద్దార్థ్, ఇతర సహాయక సిబ్బంది కలిసి రీజినల్ తొరసిక్ ఎపిడ్యూరల్ అనే పద్ధతిలో మత్తు మందుని పంపి రోగికి ఆపరేషన్ సమయంలో అనంతరం నొప్పి పూర్తిగా తెలవకుండా ఉండే విధంగా చేశారు. ఈ ఆపరేషన్ ని సీనియర్ సర్జన్ పెంచలయ్య నేతృత్వంలో డాకర్లు రాజేంద్ర, జెస్సీ, రత్నకుమారి, ఇతర సహాయక సిబ్బంది ఝాన్సీ, బ్లొసం కలిసి విజయవంతంగా నిర్వహించారు.

# 4 పథకాలు 4,42,327 లబ్ధిదారులు

**కలంజ్యోతి, హైదరాబాద్ :**



గణతంత్ర దినోత్సవం తర్వాత రాష్ట్రంలో నాలుగు ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలు ప్రారంభిస్తామని ప్రకటించిన ప్రభుత్వం చెప్పినట్టే తొలి విడతగా 561 గ్రామాల్లో 4,42,327 పథకాలకు ఫలాలు అందించింది. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా మొత్తం 561 గ్రామాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు సీఎం, మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఆయా పథకాల లబ్ధిదారుల వివరాలను అధికారులు సోమవారం వెల్లడించారు. ఇందులో రైతు భరోసాకు 3,07,318 మంది లబ్ధిదారులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 20,336 మంది లబ్ధిదారులు, 42,267 కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కింద 72,406 గృహాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు అర్హత పత్రాలు అందజేస్తున్నారు. మరోవైపు మార్చి 31లోపు అన్ని గ్రామాల్లో అర్హులందరికీ ఈ నాలుగు పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రతి గ్రామంలో ఏకకాలంలో ఈ పథకాలు అమలుచేయడం ద్వారా సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తుంది. రైతు 'భరోసా' కు రూ. రూ. 570 కోట్లు విడుదల రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు వినిపించింది. పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం అందజేస్తున్న రైతు భరోసా పథకానికి సంబంధించి నిధులను రైతుల ఖాతాల్లో నేటి నుంచి జమ చేయడం ప్రారంభించింది. తొలి విడతగా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 561 గ్రామాల్లో రైతుల ఖాతాల్లో నిధులను జమ చేయడం ప్రారంభించింది. అందుకోసం రూ.570 కోట్ల నగదును విడుదల చేసింది. ఏడాదికి ఎకారానికి రూ.10 వేల నుంచి రూ. 12 వేలకు పెంచిన ఆర్థిక సహాయం రైతుల ఖాతాల్లో జమ అవుతున్నది. దాంతో రైతుభరోసా సాయం కోసం ఎదురుచూస్తున్న రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## ఆత్మీయ భరోసాపై

# హైకోర్టులో పిల్

**కలంజ్యోతి, హైదరాబాద్ :**

ప్రజా ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం అమలుకు ఆదిలోనే హంసపాదు ఎదురైంది. ప్రభుత్వ పథకం 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా'పై తెలంగాణ హైకోర్టులో పిల్ దాఖలైంది. నారాయణపేటకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో పిటిషన్ వేశారు. భూమి లేని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు చెల్లించేలా తెలంగాణ ప్రభుత్వం పథకం రూపొందించిందని, పట్టణ (మున్సిపాలిటీల పరిధి) రైతు కూలీలకు మాత్రం డబ్బులు ఇవ్వడం లేదని శ్రీనివాస్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ కోర్టుకు హాజరయ్యారు. రాష్ట్రంలోని 129 మున్సిపాలిటీల్లో మొత్తంగా 8 లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ గవినోళ్ల శ్రీనివాస్ తరపు న్యాయవాది హైకోర్టుకు తెలిపారు. గ్రామాల్లోని రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇచ్చి.. మున్సిపాలిటీల్లోని వారికి ఇవ్వకపోవడం ఏమాత్రం సరికాదన్నారు. రైతు కూలీలు అందరూ సమానమేనని, ఎక్కడ ఉన్నా అందరూ కూలీలే అని పేర్కొన్నారు. కేవలం గ్రామాల్లోని రైతు కూలీలకే పథకం వర్తింపజేయడం సుప్రీంకోర్టు తీర్పుకు విరుద్ధమని న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ అన్నారు. ఈ పిటిషన్‌పై నాలుగు వారాల్లో తుది నిర్ణయం వెల్లడించాలని హైకోర్టు రాష్ట్ర సర్కార్ ను ఆదేశించింది.

# జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సహకరించాలి

**కలంజ్యోతి, చిగురుమామిడి :**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలంలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల ఇంటి స్థలాలకు సహకరించాలని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్, చిగురుమామిడి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డికి, చిగురుమామిడి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు చిట్టంపల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాకం కరుణాకర్ ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. చిగురుమామిడి మండలంలో గత కొన్ని సంవత్సరాల నుండి వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న వారికి ఎలాంటి జీతభత్యాలు లేక, మెరుగైన వసతులు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరామని, అప్పటి నుండి ఇప్పటివరకు ఇంటి స్థలాల విషయం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లుగా ఉందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మండలంలో పని చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇప్పించాలని కోరారు. అనంతరం హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మాత్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ దృష్టికి చిగురుమామిడి మండల జర్నలిస్టుల సమస్యను తీసుకువెళ్తానని, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో జర్నలిస్టులకు ఇంటి స్థలాలను మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ గౌరవ అధ్యక్షుడు కొంకట బాలయ్య, ఉపాధ్యక్షుడు ఎనగందుల రవీందర్, గుడికందుల దేవదాసు, సుందరగిరి మాజీ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, ముల్కనూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్ గౌడ్, పాల్గొన్నారు.

# జర్నలిస్టుల విలువలను కాపాడండి

- బోర్ల వద్ద జర్నలిస్టుల పేర్లు చెప్పే వారిపై చర్యలు తీసుకోవాలి
- వత్తాసు పలుకుతున్న రెవెన్యూ సిబ్బందిపై దృష్టి పెట్టండి
- తహసీల్దార్ కు వినతిపత్రం అందించిన కూకట్‌పల్లి ప్రెస్‌క్లబ్ సభ్యులు
- మా దృష్టికి వస్తే కేసులు నమోదు చేస్తాం: తహసీల్దార్ స్వామి



**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** జర్నలిస్టుల విలువలు దిగజార్చే విధంగా వ్యవహరిస్తున్న వారి పట్ల చర్యలు తీసుకోవాలని కూకట్పల్లి ప్రెస్ క్లబ్ ప్రతినిధి బృందం మండల తహసీల్దార్ కు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం కేపీహెచ్బీ కాలనీలోని మండల తహసిల్దార్ స్వామి నాయక్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ బోర్లు వేసే దగ్గర కొందరు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. జర్నలిస్టుల పేరుతో సామాన్యులను బెదిరించడమే కాకుండా ఉన్నతాధికారులకు కూడా ఫోన్లు చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది. ఇది సరైన చర్యలు కావనివారు ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల పేరు చెప్పుకొని బెదిరింపులకు పాల్పడుతున్న వారికి కొందరు రెవెన్యూ సిబ్బంది కూడా వత్తాసు పలుకుతున్నారని ఫిర్యాదు చేశారు. సామాన్యులను ఇబ్బందుల గురిచేయడంలో జర్నలిస్టుల ముసుగులో ఉన్నవారికి వత్తాసు పలుకుతున్న రెవిన్యూ సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నానాటికి దిగజారిపోతున్న జర్నలిస్టుల విలువలను కాపాడటంలో మండల మేజిస్ట్రేట్ గా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అడ్డదిడ్డంగా ఫోన్లు చేస్తూ ఇబ్బందుల గురి చేస్తున్న వారిపై కూడా కేసులు నమోదు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన తహసిల్దార్ స్వామి నాయక్ జర్నలిస్టుల సంఘాలు తీసుకుని నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కొందరు చేస్తున్న తప్పుడు పనుల తో నిజమైన జర్నలిస్టులకు విలువ లేకుండా పోతుందనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. జర్నలిస్టులు అందరు కలిసి తీసుకున్న నిర్ణయం మంచి పరిణామాలకు దారి తీస్తుందన్నారు. అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నటువంటి తమ సిబ్బంది పై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, సంఘం రాష్ట్ర నాయకులు దయసాగర్, నిమ్మల శ్రీనివాస్, లక్ష్మణ్ కూకట్పల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎం ఏ కరీం, జర్నలిస్టుల సంఘం నాయకులు దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, గంగరాజు, చంద్ర, సదా మహేష్, మాణిక్య రెడ్డి, నాగరాజు, హరిబాబు, సాగర్ రెడ్డి, హరి, పవన్, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అవన్నీ అసత్య ప్రచారాలు

## టీయూడబ్ల్యూజే 143యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్లగట్ట గంగాధర్



**కలంజ్యోతి, కొడిమ్యాల :** కొడిమ్యాల టీయూడబ్ల్యూజే 143 ప్రెస్ క్లబ్ యూనియన్ రద్దైందని జనవరి 26 న కొందరు వ్యక్తులు చేసిన పోస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు అడ్లగట్ట గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వాట్సాప్ గ్రూప్ లలో టీయూడబ్ల్యూజే 143 యూనియన్ రద్దైనట్లు కొన్ని గ్రూప్ లలో చేసిన పోస్టుపై జిల్లా అధ్యక్షుడు శికారి రామకృష్ణ, దోమటి అంజు గౌడ్ ఆదేశాల మేరకు జిల్లా ఉపాధ్యక్షుడు అడ్ల గట్ట గంగాధర్ స్పందిస్తూ టీయూడబ్ల్యూజే 143 ప్రెస్ క్లబ్ యూనియన్ కానీ,యూనియన్ బాడీని కానీ రద్దు చేయలేదని, కొందరు వ్యక్తులు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రెస్ క్లబ్ యథావిధిగా కొనసాగుతుందని ఈ విషయాన్ని మండల అధికారులు, నాయకులు, ప్రజలు గమనించాలని కోరారు.



## మాదిగ విద్యార్థి యువగర్జన


# జయప్రదం చేయండి

## మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుందిళ్ళ సతీష్

**కలంజ్యోతి, మంచిర్యాల :** ఫిబ్రవరి 2న ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించనున్న మాదిగ విద్యార్థి యువగర్జన ను విజయవంతం చేయాలని మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు సుందిళ్ళ సతీష్ కోరారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో మాదిగ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్ లక్ష్యంగా మాదిగ జేఏసీ వ్యవస్థాపకులు, రాష్ట్ర తొలి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి నాయకత్వంలో నిర్వహించనున్న మా దిగ విద్యార్థి యువ గర్జనకు జిల్లాలోని మాదిగలంతా హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాదిగ జేఏసీ చెన్నూరు ఇంచార్జ్ సంతోష్ , నాయకులు సాయి, నరేష్, రాకేష్, మహేష్, రవి పాల్గొన్నారు.

# పైలట్ ప్రాజెక్టు కింద సర్వాపూర్

- లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసిన అడిషనల్ కలెక్టర్



**కలంజ్యోతి, మల్యాల :** మండలంలోని సర్వాపూ ర్ గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రకటించిన అధికారులు అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత చేతు ల మీదుగా అర్హులైన లబ్ధిదారులకు ఆయా పథ కాల ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కింద 111 మందికి, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద 33 మందికి, రైతు భరోసా కింద 659 మందికి, 127 మందికి రేషన్ కార్డుల మంజూరుకు సంబంధించి ప్రొసీడింగ్స్ అందజే శారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు ఏర్పాటు చేసిన సమావేశంలో ముందుగా సీఎం సందేశం వీడి యోను ప్రదర్శించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ దరఖాస్తు చేసుకొని, పేరు రాని వాళ్ళు ఆందోళన చెందొద్దని, విడుతల ప్రకారం అందరికీ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బత్తిని మల్లీశ్వరి, తహసీల్దార్ మునీందర్, ఎంపీడీవో స్వాతి, డీటి నితా, ఎంపీఓ ప్రవీణ్, ఏవో చంద్ర దీపక్, ఏపీఓ శ్రీనివాస్, ఎస్ఐ నరేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు దొంగ ఆనందరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, శనిగారపు తిరుపతి, నేరెళ్ళ సతీష్‌రెడ్డి, తాళ్ళ హరినాథ్, కటకం వినయ్, హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర 2వ మహాసభలను

# విజయవంతం చేయండి

**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐటీయూసీ) పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షురాలు కొక్కుల శాంత ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ నెల 30, 31 న కోరుట్ల డివిజన్ లో జరిగే రాష్ట్ర 2 వ మహాసభలను విజయవంతం చేయాలని కొక్కుల శాంత కోరారు. కార్యక్రమంలో మండలానికి చెందిన బీడీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

4 కలంజ్యోతి
General News మంగళవారం 28.01.2025



# పాపయ్యపేటలో పశు వైద్య శిబిరం

## ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్

**కలంజ్యోతి, చెన్నారావుపేట :** చెన్నారావుపేట మండలం పాపయ్యపేట గ్రామంలో మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట వ్యవసాయ శాఖ మార్కెట్ కమిటీ ఏర్పాటుచేసిన పశువైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ పాల్వాయి శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పాడి పశువులను పెంచుకోవడం ద్వారా ఆర్థికంగా బలోపేతమవుతారన్నారు. అనంతరం పాడి రైతులకు పశువుల మందులను అందజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# ఓపీఎస్ అమలు చేయాలి

**కలంజ్యోతి, మొయినాబాద్ :** సీపీఎస్ (కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్) రద్దు చేసి ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను అమలు చేయాలని మొయినాబాద్ పీఆర్ టీయుటీఎస్ మండల అధ్యక్షులు జక్కని బందయ్య, ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పీఆర్ టీయుటీఎస్ కు చెందిన ఉపాధ్యాయులతో కలిసి ప్రభుత్వం యూపీఎస్ పై విడుదల చేసిన గెజిట్ కు వ్యతిరేకంగా నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో పీఆర్ టీయుటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మొయినాబాద్ తహశీల్దార్ వినోద్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు.



**1962 సంచార వాహన కెప్టెన్ శివ ప్రసాద్ కు విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించాడు. దాంతో అతడితో కలిసి ఇంతకాలం అతడితో పని చేసిన సిబ్బంది, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శాలువాలతో సత్కరించారు.**

**– కలంజ్యోతి, నర్సంపేట**




# బాసర ట్రిపుల్ ఐటీలో అధ్యాపకుల ఆందోళన

**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్లు సోమవారం ఆందోళనకు దిగారు. గత 15 సంవత్సరాలుగా తాము విధులు నిర్వహిస్తున్నా తమను క్రమబద్ధీకరించడంలో ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు భోజన విరామ సమయంలో విద్యా సంస్థ ఎదుట కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. యూజీసీ స్కేల్ తో కూడిన వేతనాన్ని ఇవ్వాలని, డి ఏ, హెచ్ఆర్ఏ సహా 3శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు

## కలెక్టర్ అభిలాష అభినవ్




**కలంజ్యోతి, నిర్మల్ :** ప్రజలు అర్జీల రూపంలో తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. రైతు రుణమాఫీ, విద్య, వైద్యం, వ్యవసాయం, పింఛన్లు, ధరణి, భూ సమస్యలు, రెండు పడక గదుల ఇండ్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు తమ అర్జీలను సమర్పించారు. ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా ఇప్పటివరకు పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు, సీఎం ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయ అధికారులు ,సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులు సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలి

### జగిత్యాల కలెక్టర్ బి, సత్యప్రసాద్



**కలంజ్యోతి, జగిత్యాల :** ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ అన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను అదనపు, కలెక్టర్లు బి,ఎస్ లత గౌతమ్ రెడ్డి కలసి స్వీకరించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో,అదనపు కలెక్టర్, బి, ఎస్ లత గౌతమ్ రెడ్డి, ఆర్డీవోలు, మధు సుధను, జివాకర్ రెడ్డి,కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, పాల్గొన్నారు.



# నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పదవీకాలం పూర్తి

**కలంజ్యోతి, కుత్బుల్లాపూర్ :** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పదవీకాలం విజయవంతంగా ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సభ్యులు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కులం హనుమంత్ రెడ్డిని బాచుపల్లి తన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొలం మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన సభ్యులను శాలువాతో సత్కరించి ఐదు సంవత్సరాల పాటు మీరు నిజాంపేట్ అభివృద్ధికి తోడ్పాటు అందించినందుకు సభ్యులందరినీ అభినందించారు. అభివృద్ధి పథంలో ముందుకు నడుపుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలను గోపాల్ రెడ్డి కార్పొరేటర్లు ఆగం పాండు ముదిరాజ్, సురేష్ రెడ్డి, చెట్ల దివాకర్, కోఆప్షన్ మెంబర్స్ తలారి వీరేష్, శ్రీకాంత్ రెడ్డి, జగన్ యాదవ్, నాగరాజ్ యాదవ్, సాయి, ఆంజనేయులు, వర్మ, తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ పురపాలక ప్రత్యేక అధికారిగా ఫైజాన్ అహ్మద్



**కలంజ్యోతి, నిర్మల్ :** నిర్మల్ మున్సిపల్ ప్రతినిధుల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఉద్యోగులతో ఆయన మాట్లాడుతూ నిర్మల్ మున్సిపాలిటిని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు సహకరించాలన్నారు. పారిశుద్ధ్యం పై ప్రత్యేక శ్రద్ధ కనబరచి, నిర్మల్ మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సమయానికి అన్ని రకాల పన్నుల వసూలును పూర్తి చేయాలని అన్నారు. నిర్మల్ మున్సిపాలిటీకి ప్రగతికి సంబంధించి నివేదికలను ఎప్పటికప్పుడు తమకు అందజేయాలని తెలిపారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో ఇటువంటి ఇబ్బందులు ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ హరిభువన్, పట్టణ ప్రణాళిక అధికారి హరీష్, ఆర్వో అనూఫ్, మెప్మా పీడీ సుభాష్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చింది యంగ్ బ్యూటీ నభా నటేష్. ఆ తర్వాత 'అదుగో' చిత్రంలో నటించినప్పటికీ అంతగా ఫేమ్ తెచ్చుకోలేక పోయింది. కానీ లవర్ బాయ్ రామ్ పోతినేని నటించిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. దాంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా 'డిస్కో రాజా', 'సోలో బ్రతుకే సో బెటర్', 'డార్లింగ్' వంటి సినిమాల్లో నటించి మెప్పించింది. ప్రస్తుతం నిఖిల్ సరసన 'స్వయంభు' మూవీలో నటిస్తోంది. అలాగే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్‌గా ఉంటూ తన అందచందాలతో కుర్రకారుకు అందాల విందును వడ్డిస్తుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా నభా నటేష్ తన ఇన్‌స్టా వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో హాట్ గా కనిపించే విధంగా ఫొటోలు పంచుకున్నది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్‌గా మారింది.